క్లుప్తంగా

ప్రశాంతంగా నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న కౌన్సిల్ సభ్యులు

నరసాపురం: నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. అజెండాలో ఇటీవల మృతి చెందిన ఓ కౌన్సిలర్, ఓ మున్సిపల్ ఉద్యోగి, మరో మాజీ కౌన్సిలర్‌లకు సంతాపం తెలిపే అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో కౌన్సిలర్లు కూడా వేరే అంశాలకు తావు ఇవ్వకుండా కేవలం సంతాప ప్రసంగాలకే పరిమితమయ్యారు. దీంతో సమావేశం ప్రశాంతంగా ముగిసింది. ముందుగా చైర్‌పర్సన్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన వైఎస్సార్‌సీపీ 16వ వార్డు కౌన్సిలర్ గొల్ల జయరాజ్‌సింగ్, అలాగే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వై.భాస్కర్, 28వ వార్డు మాజీ కౌన్సిలర్ కత్తుల శ్యామ్ మృతిపై సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కొత్తపల్లి నాని, కామన నాగిని, కౌన్సిలర్లు వైకేఎస్, కోటిపల్లి సురేష్, వన్నెంరెడ్డి శ్రీనివాస్, అడిదల శ్యామల, షేక్ అభేధాసుల్తానా మృతుల సేవలను కొనియాడారు. చైర్‌పర్సన్ వెంకటరమణ, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఒకే నెలలో మున్సిపాలిటీకి చెందిన ముగ్గురు దూరమవ్వడం బాధాకరమన్నారు. కౌన్సిల్ సమావేశంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కౌన్సిలర్లు పాలూరి ప్రసాద్, యర్రా ఉమ, కేసరి గంగరాజు, జిల్లెళ్ల దిలీప్, మల్లేడి శేషవేణి తదితరులు పాల్గొన్నారు.

ఫెడల్ టూ ఫ్రీడం సైకిల్ ర్యాలీకి ఏఎస్ఎన్ఎం విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: సామాజిక న్యాయం, సెక్సువల్ వేధింపులు, ఎడ్యుకేషన్ వంటి పలు అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఈ సైకిల్ ర్యాలీ ఏర్పాటుచేస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి తెలిపారు. బుధవారం అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫెడల్ టూ ఫ్రీడం-23 స్టూడెంట్స్ సైకిల్ ర్యాలీకి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి మాట్లాడుతూ కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ అండ్ రెడ్ రోప్ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ఫెడల్ టూ ఫ్రీడం సైకిల్ ర్యాలీకి కళాశాల నుండి నలుగురు విద్యార్థులు ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. ఈ సైకిల్ ర్యాలీలో పాల్గొనేందుకు మంగళవారం సాయంత్రం విద్యార్థులు గుంటూరు బయలుదేరి వెళ్లారన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.రామకృష్ణ, వి.విజయలక్ష్మి, పీడీ జి.మహేష్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

పోలింగ్ బూత్‌ల మార్పునకు సిఫార్సు

పాలకొల్లు అర్బన్: నియోజకవర్గంలోని పాలకొల్లు పట్టణం, పాలకొల్లు మండలం, యలమంచిలి మండలాల్లో పలు పోలింగ్ స్టేషన్లు మార్పు చేస్తూ ఎన్నికల సంఘానికి సిఫార్సు చేసినట్లు నియోజకవర్గ ఎలక్టోరల్ రెవెన్యూ ఆఫీసర్ కేసీహెచ్ అప్పారావు తెలిపారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో పోలింగ్ స్టేషన్లు మార్పునకు సంబధించి వీఆర్వోలతో ఆయన సమీక్షించారు. పట్టణంలోని ఓరియంటల్ కళాశాలలో ఉన్న 103 పోలింగ్ బూత్‌ను క్రిస్టియన్ పేట మునిసిపల్ స్పెషల్ ప్రైమరీ స్కూల్‌కి మార్చడానికి ప్రతిపాదన చేశామన్నారు. అలాగే అదే కళాశాలలోని 104 బూత్‌ను క్రిస్టియన్‌పేట మునిసిపల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం గదిలోకి మారుస్తూ ప్రతిపాదించామన్నారు. మండలంలోని లంకలకోడేరు 139 పీఎస్, ఆగర్రు ప్రాథమిక పాఠశాలలోని 161, 162 పీఎస్ పక్క భవనాల్లోకి మారుస్తూ ప్రతిపాదించామన్నారు. వీటితో పాటు యలమంచిలి మండలంలో 10 పోలింగ్ స్టేషన్లు మార్పునకు చర్యలు తీసుకుంటున్నట్లు అప్పారావు తెలిపారు. ఆయా పోలింగ్ స్టేషన్లు శిథిలావస్థకు చేరుకోవడం వల్ల అదే కాంపౌండ్‌లోని నూతనంగా నిర్మించిన భవనాల్లోకి మారుస్తూ ఈ ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు.

పౌష్టికాహారం అందజేత

పెనుగొండ: చిన్నారులు, కిషోర్ బాలికలు, గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య అన్నారు. బుధవారం వల్లూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన పోషణ వారోత్సవాల్లో పాల్గొని పౌష్టికాహార విశిష్టతను వివరించి, పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యు డాక్టర్ వేణుబాబు, ఎంపీహెచ్‌వో శివకుమార్ పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదంపై హర్షం

యలమంచిలి: పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడంపై మహిళ మోర్చా సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మేడపాడు, గుంపర్రు, దొడ్డిపట్ల గ్రామాలలో బుధవారం జరిగిన మహిళ మోర్చ సమావేశాలో పలువురు మహిళలు పాల్గొన్నారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లు ఆమోదం పొందడం మహిళా లోకానికి శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో మహిళ మోర్చ నాయకులు కొమ్మిరెడ్డి చంద్రకళ, కూనపురెడ్డి మణి కుమారి, అడబాల సత్యవతి పాల్గొన్నారు.

గ్రామాల్లో నిమజ్జనోత్సవాల సందడి

- మూడో రోజు కావడంతో ఘనంగా గ్రామోత్సవాలు
- ఆకట్టుకున్న వేషధారణలు



పెనుగొండ: వడలిలో నిమజ్జనోత్సవంలో ఆకట్టుకొన్న మహిళల తీన్మార్



పెనుమంట్ర: విచిత్ర వేషధారణలతో ట్రాక్టర్‌లపై ఊరేగుతున్న చిన్నారులు

పెనుగొండ: గణేష్ నిమజ్జనాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆచంట, పెనుగొండ మండలాల్లో చవితి పందిళ్లల్లో పూజలందుకున్న గణపతి ప్రతిమలకు బుధవారం పలు ప్రాంతాల్లో గ్రామోత్సవాలు నిర్వహించారు. కొఠాలపర్రు, సోమరాజు చెరువు, సిద్ధాంతం, కోడేరు, ఆచంటల్లో మంగళవాయిద్యాలు, తీన్‌మార్ వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో గ్రామోత్సవాలు నిర్వహించారు. అనంతరం సిద్ధాంతం కేదారీఘాట్‌లో వైభవంగా నిమజ్జనం చేశారు.

వడలిలో ఆకట్టుకున్న మహిళల తీన్మార్

వడలిలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నిమజ్జనత్సోవంలో ఏర్పాటు చేసిన మహిళల తీన్మార్ ఆకట్టుకుంది. అమలాపురం నుంచి వచ్చిన మహిళలు తీన్‌మార్‌తో హోరెత్తించారు. వడలి పురవీధుల్లో ఉత్సవంలోనూ, వడలి నుంచి సిద్ధాంతం వరకూ సందడి చేశారు. మహిళల తీన్‌మార్ తిలకించడానికి భారీగా భక్తులు తరలివచ్చారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: వినాయకచవితి తర్వాత మూడో రోజు నేపథ్యంలో బుధవారం వినాయక నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలతో పాటు మొగల్తూరు పేటపల్లంలోని వినాయకయూత్ ఆధ్వర్యంలో వినాయకున్ని గ్రామంలోని పలు వీధుల్లో ఊరేగించి నిమజ్జనం చేశారు. స్థానిక రాజ్యలక్ష్మి అమ్మవారి ఆలయం సమీపంలో నెలకొల్పిన వినాయకున్ని మహిళలు ఊరేగించి నిమజ్జనం చేశారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు

నరసాపురం రూరల్, గణపతి నవరాత్రులను పురస్కరించుకుని మండలంలో వివిధ గ్రామాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్నారు. నరసాపురం నందమూరి వీవర్స్ కాలనీలోని బాల విద్యాగణపతి ఆలయంలో స్వామివారికి ప్రతీరోజు ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం 1008 మైసూర్‌పాక్ స్వామి వారిని అలంకరించిన తీరు ఆకట్టుకుంది.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: వినాయక చవితి ఉత్సవాలు సందర్భంగా మూడవ రోజు బుధవారం మండలంలోని వివిధ మండపాల వద్ద వినాయకుని పూజోత్సవాలు ఘనంగా జరిగాయి. పెనుమంట్రలోని పల్లపువీధి రెడ్డి యూత్ ఆధ్వర్యంలో పంచాయితీ చెరువుగట్టున గల హనుమాన్ టెంపుల్‌వద్ద గణపతిపూజోత్సవాలు కొవ్వూరి నాగమోహన్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. వేదపండితులు చిట్టా రవి ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించిన అనంతరం గణపతిని పూలరథంపై ఉంచి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. తీన్‌మార్ వాయిద్యాలు, మేళతాళాలతో యువకులు విచిత్ర వేషధారణలతో ట్రాక్టర్‌పై గ్రామోత్సవంలో పాల్గొన్నారు. అదేవిధంగా మార్టేరులోని ఆటోమోబైల్ యూనియన్ ఆధ్వర్యంలో గణపతి పూజలు ఘనంగా జరుగుతున్నాయి. మార్టేరులో వైఎస్సార్ సెంటర్‌లో ఆర్య వైశ్య సంఘం నిర్వహిస్తున్న మండపం వద్ద మహిళలు వేదపారాయణం నిర్వహించి గణపతికి హారతులు పట్టారు. పెనుమంట్రలో రామాలయం సెంటర్‌లో కర్రి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నెలకొల్పిన విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: వినాయకచవితి ఉత్సవాలు సందర్భంగా పట్టణంలో వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన గణనాథులకు భక్తులు అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం మూడో రోజు కావడంతో కొన్ని ప్రాంతాల్లో నిమజ్జనాలు నిర్వహించారు. పట్టణంలోని బ్యాంక్ వీధిలో పరమేశ్వరుని అలంకరణలో గణనాథుడిని ఏర్పాటు చేశారు. భారీ సెట్టింగులతో విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేశారు.



మొగల్తూరు: వినాయక నిమజ్జనంలో పాల్గొన్న వినాయక యూత్ సభ్యులు



నరసాపురం రూరల్: 1008 మైసూర్‌పాక్‌తో పూజలు చేసిన దృశ్యం



పాలకొల్లు సెంట్రల్: బ్యాంక్ వీధిలో కొలువై ఉన్న పరమేశ్వర గణపతి

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు



కొడమంచిలిలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సీతారామ్

పెనుగొండ: రాష్ట్రంలో క్రీడాకారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహించి మాణిక్యాలను వెలికి తీస్తున్నారని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. బుధవారం కొడమంచిలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలోని అండర్-14, అండర్-17 బాలురు వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నియోజకవర్గ జట్టుకు ఎంపిక చేస్తారన్నారు. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ఉత్తమ ప్రతిభను కనబర్చాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణా రెడ్డి, స్కూ లు పీడీ చిరంజీవి, స్కూలు కమిటీ చైర్మన్ బొరుసు రాంబాబు, ప్రధానోపాధ్యాయుడు పి రామకృష్ణ, ఉప సర్పంచ్ ములగాడ వరప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు నల్లూరి చందు, దొమ్మేటి రాంబాబు, పిల్లి రుద్ర ప్రసాద్, చంద్ర శేఖర్, కోన రవి పాల్గొన్నారు.

ఎల్బీచర్లలో..

నరసాపురం రూరల్: చదువుతోపాటు విద్యార్థులకు క్రీడలు ఎంతో అవసరమని ఎస్ఎంసీ చైర్మన్ కడలి రామకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు పి.సత్యనారాయణ లు అన్నారు. మండలంలోని ఎల్బీచర్ల ఉన్నతపాఠశాల ఆవరణలో బుధవారం మండలస్థాయి స్కూల్ గేమ్స్ సెలక్షన్స్‌ను ఆయన ప్రారంభించారు. గురువారం బాలుర సెలక్షన్లు ఉంటాయని వ్యాయామోపాధ్యాయుడు కవీ శేఖర్ అన్నారు. ఈ పోటీలకు 20మంది వ్యాయామోపాధ్యాయులు రిఫరీలుగా వ్యవహరించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



సగంచెరువులో సచివాలయ ఉద్యోగుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న గుడాల శ్రీహరి గోపాలరావు

పాలకొల్లు అర్బన్: గ్రామ పంచాయతీలో దీర్ఘకాలికంగా పరిష్కారం కాకుండా ఉన్న సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే వాటిని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) హామీ ఇచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి ఆయా గ్రామ సర్పంచ్‌లను, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులను, వలంటీర్లను పరిచయం చేసుకుని మాట్లాడారు. పెదమామిడిపల్లిలో సచివాలయ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ ఉపసర్పంచ్ యాండ్ర గోపి కోరారు. కొత్తపేట నుంచి పెదమామిడిపల్లి వరకు వేసిన 40 ఏళ్ల క్రితం వేయడం వల్ల వాటి నాణ్యత తగ్గిపోయి విద్యుత్ తీగలు తెగిపడి ప్రజలు ప్రాణాలు పోగొట్టుకున్నారని, ఈ లైన్ తక్షణం మార్చాలని దిగమర్రు సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్ గుడాల గోపి దృష్టికి తీసుకువచ్చారు. కొత్తపేట గ్రామ సచివాలయాన్ని సందర్శించి సచివాలయ ఉద్యోగులను పరిచయం చేసుకున్నారు. అలాగే సగంచెరువులో నూతనంగా నిర్మించిన జగనన్న కాలనీని సందర్శించారు. గ్రామంలో పంచాయతీ కార్యదర్శి లేకపోవడం వలన పనులు ముందుకు సాగడం లేదని సర్పంచ్ కడలి నాగమణి గోపి దృష్టికి తీసుకువచ్చారు. ఆగర్రు, చందపర్రు, గోరింటాడ గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లో సమస్యలు తెలుసుకున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో గ్రామాల్లోని ప్రధాన సమస్యలు పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే దిగమర్రు ఛానెల్‌లోకి పట్టణంలోని మురుగు నీరు చేరకుండా శాశ్వత పరిష్కార మార్గాలు మునిసిపల్ అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటానని గోపి హామీ ఇచ్చారు. ఆయన వెంట జడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు, పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, సర్పంచ్‌లు కవురు భారతి, సాకా గంగారత్నం, మండెల పావని, కొయ్యే అచ్చియ్య, కవురు భాస్కరబాబు, మండెల నాని, కుక్కల శ్రీనివాస్, రాపాక సునిబాబు, కొండేటి మల్లికార్జునరావు, యాండ్ర జయబాబు, పాలపర్తి కుమారరత్నం, ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నవరత్నాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

సంక్షేమ పథకాలను నవరత్నాల పేరుతో మేనిఫెస్టోలో పెట్టి వాటిని అధికారం చేపట్టిన అతి తక్కువ కాలంలోనే నూటికి నూరుశాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నూతనంగా ముద్రించిన నవరత్నాల వాల్ పోస్టర్‌ను బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు. రెండో విడత గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల వద్దకు వెళ్లే ముందు ఈ వాల్ పోస్టర్‌ను ఆయా గ్రామాల్లో ముఖ్య కూడళ్లలో అతికించాలని కార్యకర్తలకు గోపి సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, చింతలపూడి, దెందులూరి పార్టీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, మోర్త గిరీష్, కలిదిండి గణపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత



మేడపాడు హైస్కూల్ విద్యార్థులకు దాత బహుకరించిన క్రీడా సామగ్రితో విద్యార్థులు

యలమంచిలి: విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు కూడా ముఖ్యమని ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి అన్నారు. మేడపాడు హైస్కూల్ విద్యార్థుల ఆట వస్తువులకు వ్యాయామోపాధ్యాయుడు రేలంగి రామకృష్ణ ప్రోత్సాహంతో రిటైర్డ్ ఉపాధ్యాయుడు దామిరెడ్డి జయరామిరెడ్డి జ్ఞాపకారం ఆయన కుమారుడు దామిరెడ్డి జయభరత్‌రెడ్డి రూ.20 వేలు బహూకరించారు. ఆ నగదుతో రామకృష్ణ వాలీబాల్, త్రోబాల్, ఫుట్‌బాల్, క్రికెట్, స్కిప్పింగ్, చెస్, టెన్నికాయిట్ కిట్స్ కొనుగోలు చేశారు. ఆ క్రీడా వస్తువులను బుధవారం ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు దామోదుల ప్రసాద్ దామిరెడ్డి, పి శ్రీనివాసరాజు (చించినాడ హైస్కూల్ హెచ్ఎం), పోలిశెట్టి క్రాంతికుమార్, కందాళం విజయమోహన్ పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం



మొగల్తూరు: మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అందే సూర్యావతి




పోడూరు: మండలపరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు

మొగల్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎంపీపీ అందే సూర్యావతి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో వలంటీర్లు ముఖ్య పాత్ర పోషిస్తున్నారన్నారు. ఈసందర్భంగా ఎంఈవో యు.శామ్యూల్ జాన్ మాట్లాడుతూ నాడు నేడు ఫేజ్ 2లో మండలంలో 46 పాఠశాలలు, 10 అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధిచేస్తున్నామన్నారు. వ్యవసాయాధికారి అబ్దుల్ రహ్మాన్ మాట్లాడుతూ మండలంలో సుమారు 1190 ఎకరాల్లో ఎకరాల్లో సార్వా సాగు చేపట్టారని వివరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, వైస్ ఎంపీపీలు కైలా సుబ్బారావు, కవురు సీతామహలక్ష్మి, ఎంపీడీఓ వి.బాబ్జిరాజు, అందే భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు, ప్రజా ప్రతినిధుల మధ్య సమన్వయం అవసరం

పోడూరు: గ్రామాల్లో సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించాలని జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్ సమావేశానికి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు పెద్దిరాజు మాట్లాడుతూ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సూచించిన సమస్యలను సత్వరమే పరిష్కరించేలా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో గ్రామాల్లో వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందకుండా పారిశుద్ధ్యం సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. ఎంపీపీ సుమంగళి సాగర్ మాట్లాడుతూ మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత క్రమంలో మండలపరిషత్ నుంచి నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో వివిధ ప్రభుత్వశాఖల అధికారులు మాట్లాడుతూ ఆయా శాఖల పనితీరును వివరించారు. పోడూరు సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు మాట్లాడుతూ గ్రామంలో గతంలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి పంచాయతీ స్థలం కేటాయించిందనీ చాలాకాలంగా నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని తిరిగి పంచాయతీకి అప్పగించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వైస్‌ఎంపీపీలు ఇందుకూరి సీతారామరాజు, గుబ్బల సత్యనారాయణ, ఎంపీడీఓ డి.సుహాసిని, తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రంగనాథరాజును కలిసిన ఎంపీడీఓ



మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుతో పెనుమంట్ర ఎంపీడీఓ పి పద్మజ.

పెనుమంట్ర: పెనుమంట్ర ఎంపీడీవోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పి పద్మజ బుధవారం మాజీ మంత్రి, స్థానిక శాసన సభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజుని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు.

రంగనాథరాజుకు వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ శుభాకాంక్షలు

అమెరికా పర్యటనను పూర్తి చేసుకుని స్వదేశానికి తిరిగివచ్చిన సందర్భంగా, పుట్టిన రోజు సందర్భంగా మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజును పెనుమంట్ర మండల ఎస్సీసెల్ నాయకులు బుధవారం తూర్పుపాలెం కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు ఓడూరు గ్రామ సర్పంచ్ బుర్రా రవికుమార్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఈది అనితప్రసాద్, మాంద్రు వెంకటేష్ పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణపై మున్సిపాలిటీ దృష్టి



రైల్వేస్టేషన్‌రోడ్డులో డివైడర్ల వద్ద అధ్వానంగా నాడు(ఫైల్)




అదే ప్రాంతంలో నేడు అందంగా ఆధునీకీకరించిన దృశ్యం

నరసాపురం: పట్టణ సుందరీకరణ విషయంలో మున్సిపల్ అధికారులు ఇటీవల కాలంలో దృష్టి పెట్టారు. పట్టణంలోని పలు ప్రాంతాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. కొంత కాలంగా సుందరీకరణ విషయంలో నిర్లక్ష్యం జరిగింది. దీంతో ఎక్కడపడితే అక్కడ రోడ్డు పక్కన పిచ్చిమొక్కలు, మట్టి దిబ్బలు దర్శనమిచ్చేవి. లాకులు నుంచి కొండాలమ్మ గుడి వరకూ గోదావరి గట్టు వెంబడీ. అలాగే మత్స్యపురి వంతెన నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ పంట కాలువ వెంబడి ప్లాట్‌ఫామ్ గతంలో నిర్మించి రెయిలింగ్ ఏర్పాటు చేశబూరు. అయితే అవన్నీ శిథిలమయ్యాయి. ఇక రైల్వేస్టేషన్ రోడ్డు, మిషన్ హైస్కూల్‌రోడ్డులో నిర్మించిన డివైడర్లు కూడా శిథిమయ్యాయి. ఇప్పుడు సందర్కీరణ పనులు చేపట్టి ఆ ప్రాంతాలను అందంగా తీర్చిదిద్దారు.

మారిన పరిస్థితి..

ఇటీవల కాలంలో కాటన్‌పార్కును అభివృద్ధి చేశారు, అలాగే పాడవతుతున్న ఏటిగట్టు పటిష్టపరిచే పనులు శరవేగంగా సాగుతున్నాయి. అలాగే ఏటిగట్టు పొడవునా సుందరీకరణ పనులు కూడా చేపట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇక రైల్వేస్టేషన్‌రోడ్డులో వీధి దీపాలు ఆధునీకరించారు. డివైడర్లను పూర్తిగా ఆధునీకరించి అందంగా తయారు చేశారు. మిషన్ హైస్కూల్‌రోడ్డులో కూడా డివైడర్లను ఆధునీకరించి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. దీంతో పట్టణం కొత్త అందాలను సంతరించుకుంది.

సుందరీకరణపై పూర్తిస్థాయిలో దృష్టి



పట్టణ సుందరీకరణపై పూర్తిస్థాయిలో దృష్టిపెడతాం. ముఖ్యంగా గోదావరి గట్టు పొడవునా అందంగా తీర్చిద్దడానికి ప్రణాళిక తయారు చేస్తున్నాం. ఉదయం, సాయంత్రం వేళల్లో గోదావరి గట్టు వద్దకు విహారం కోసం పెద్ద ఎత్తున జనం వస్తున్నారు. గట్టు పొడవునా ఆహ్లాదకర వాతావరణం నెలకొనేలా చర్యలు చేపడతాం. ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో సుందరీకరణ పనులు చేశాం.

-కె.వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్